1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

మంగళవారం | మే 28, 2024 | www.navatelangana.com

పక్షుల సంరక్షణకు కృషి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేష్ అన్నారు. సోమవారం కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలంను వారి కార్యాలయంలో వేరువేరుగా కలిసి బర్డ్ ఫీడర్‌లను అందజేశారు. పక్షులను రక్షించేలా తమవంతుగా ప్రణాళిక రూపొందించాలని ఈ సందర్భంగా వారిని ఆయన కోరారు. పక్షుల సంరక్షణకు ఆయన చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రకృతిలో మానవళికి తమ వంతు సహాయపడే పక్షి జాతిని కాపాడుకోవాలని తెలిపారు.



సుధాకర్ మృతి కార్మికోద్యమానికి తీరని లోటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఎస్‌డబ్ల్యుఎఫ్(స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్) నాయకుడు అనుముల సుధాకర్ మృతి కార్మికోద్యమానికి తీరని లోటని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి డి.మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు అన్నారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకుడిగా ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడారని గుర్తు చేశారు. మృతికి సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



సీఐటీయూ సంతాపం

ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకుడు అనుముల సుధాకర్ మృతికి సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.ఆశన్న, ఎ.కిరణ్ ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

నకిలీల జోరు..అన్నదాత బేజారు..!

- రోజువారీగా పట్టుబడుతున్న అనుమతి లేని విత్తనాలు
- రహస్య ప్రాంతాల్లో నిల్వలు..ఆపై దుకాణాలకు చేరవేత
- ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా కొనసాగుతున్న దందా
- కొనుగోలు చేసిన రైతుల్లో వ్యక్తమవుతున్న ఆందోళన
- టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో వెల్లడవుతున్న డొల్లతనం

ఉమ్మడి జిల్లాలో జోరుగా నకిలీ విత్తనాలు పట్టుబడటంతో అన్నదాతలు కలవరపడుతున్నారు. టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో క్వింటాళ్ల కొద్దీ అనుమతి లేని పత్తి విత్తనాలు పట్టుబడుతుంటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అందరికీ అన్నం పెట్టే అన్నదాతల పట్ల అక్రమార్కులు వ్యవహరిస్తున్న తీరుతో అందరిలోనూ ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. కొనుగోలు చేసిన విత్తనం నిజమైనదా.. నకిలీదా అని తెలుసుకోలేని పరిస్థితిలో ఉన్న అనేక మంది రైతులు అయోమయానికి గురవుతున్నారు. విత్తనాలు కొనుగోలు చేయాలంటేనే భయపడుతున్నారు. ఏది నిజమో..ఏది అబద్ధమో తెలియక తికమకపడుతున్నారు. నకిలీలను అరికట్టేందుకు ఆలస్యంగా మేల్కొన్న అధికార యంత్రాంగం.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేసింది. దీంతో ఈ వారం రోజుల వ్యవధిలోనే పలుచోట్ల అనుమతి లేని విత్తనాలు దొరకడం సర్వత్రా చర్చకు దారితీస్తోంది. ఇప్పటికే మెజార్టీ రైతుల ఇంటికి విత్తనాలు చేరిపోవడంతో ఇది వరకే తనిఖీలు చేపట్టి ఉంటే మరింత ప్రయోజనం ఉండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలో మూడు రోజులుగా తనిఖీలు చేపడుతున్న అధికారులకు వరుసగా రెండు రోజులు నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. ఈ రెండు రోజుల వ్యవధిలో రూ.9.87లక్షల విలువ చేసే 3.95క్వింటాళ్లు పట్టుకోగా..తాజాగా సిర్పూర్(టి)లో రూ.50వేల విలువ చేసే 20కిలోల పత్తి విత్తనాలు పట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది.
- ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మూడు రోజుల క్రితం అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 19.45లక్షల విలువైన పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. వివిధ కంపెనీల పేరిట అనుమతి పత్తి విత్తనాలు ఆకర్షణీయ ప్యాకెట్లలో నింపుతూ వివిధ ప్రాంతాలకు సరఫరా చేసేందుకు గోదాంలో నిల్వ చేసిన విత్తనాలు అధికారులు పట్టుకొని బాధ్యులైన ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.
- మంచిర్యాల జిల్లాలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న తనిఖీల్లోనూ పలు చోట్ల నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి. నెన్నెలలో 20కిలోలు..తాండూరులో 30కిలోలతో పాటు బెల్లంపల్లిలోనూ అనుమతి లేని విత్తనాలు పట్టుబడటం కలకలం రేపుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నకిలీ విత్తనాలకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది. రైతులను నష్టపర్చడమే లక్ష్యంగా కొన్ని ముఠాలు ఉమ్మడి జిల్లాలో స్వైర విహారం చేస్తున్నాయి. రైతులను ముంచి..కోట్లు గడించాలనే లక్ష్యంతో విచ్చలవిడిగా నకిలీ విత్తన దందాను కొనసాగించడం చర్చనీయాంశంగా మారుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేస్తుండగా.. వివిధ ప్రాంతాల్లో రోజువారీగా అనుమతి పత్తి విత్తనాలు పట్టుబడుతుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ వారం రోజుల వ్యవధిలోనే సుమారు 50లక్షలకు పైగా అనుమతి లేని పత్తి విత్తనాలు పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. మహారాష్ట్ర, ఆంధ్రాతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి సీజన్ ప్రారంభంలోనే ఇక్కడకు తీసుకొచ్చి రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. స్థానిక డీలర్ల సాయంతో వివిధ గ్రామాలు, దుకాణాలకు వీటిని సరఫరా చేస్తున్నారు. వివిధ రకాల కంపెనీల పేరిట ఆకర్షణీయమైన ప్యాకెట్లలో నింపి దుకాణాల ద్వారా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అధిక దిగుబడి వస్తుందని..రసాయనిక మందులు కూడా అధికంగా పిచికారి చేయాల్సిన అవసరం ఉండదని.. మొక్కలు ఏపుగా పెరుగుతాయని ఇలా పలు రకాలుగా రైతులను నమ్మించి తక్కువ ధరకు వీటిని అంటగడుతున్నట్లు తెలుస్తోంది.



సిర్పూర్(టి)లో పట్టుబడ్డ నకిలీ విత్తనాలు



చింతలమానేపల్లిలో పట్టుబడ్డ నకిలీ విత్తనాలు

అన్నదాతల్లో ఆందోళన..!

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్వింటాళ్ల కొద్దీ అనుమతి లేని పత్తి విత్తనాలు పట్టుబడుతుండటం తీవ్ర చర్చకు దారితీస్తోంది. మృగశిరకార్తె ముంచుకొస్తుండగా.. ఆ లోగా విత్తనాలు కొనుగోలు చేసి ఇంటిలో భద్రపర్చిన రైతుల్లో ఆందోళనకు రేకెత్తిస్తోంది. ఇప్పటికే అనేక మంది రైతులు విత్తనాలు కొనుగోలు చేయడం..ప్రస్తుతం వివిధ కంపెనీల పేరిట విక్రయిస్తున్న విత్తనాలు నకిలీవని తేలుతుండటంతో మరింత భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన విత్తనాలు ఒరిజినల్‌లా..నకిలీలా అనే అనుమానాలతో తీవ్రంగా సతమతమవుతున్నారు. ఎందుకంటే ఒక్కసారి భూమిలో నాటిన తర్వాత మొలకెత్తకపోతే పంట కాలం ఆలస్యమయ్యే అవకాశం ఉండటం.. కాలానికి అనుగుణంగా ఎదుగదల లోపించే అవకాశం ఉండటంతో రైతులు దిగులు చెందుతున్నారు. వారం రోజుల క్రితమే టాస్క్‌ఫోర్స్ టీంలు ఏర్పాటుచేసిన యంత్రాంగం.. ముందస్తుగానే తనిఖీలు చేపట్టి ఉంటే నకిలీ విత్తనాలు చాలా వరకు కట్టడి చేసేందుకు అవకాశం ఉండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చాలా చోట్ల విత్తనాలు రైతుల ఇంటికి చేరిన తర్వాత తనిఖీలు చేపడుతుండటం.. వారి తనిఖీల్లో నకిలీవని తేలుతుండటం అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తనిఖీలు మరింత ముమ్మరం చేసి నకిలీలను పూర్తిగా నిర్మూలించాలని అన్నదాతలు కోరుతున్నారు.

విలీన వార్డు సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని విలీన వార్డుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని కేఆర్కే కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. నీటి సమస్య అధికంగా ఉందని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అక్కడే పైప్‌లైన్ మరమ్మత్తులు జరుగుతుండడంతో కార్మికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీటిని సరఫరా చేయలేకపోతున్నామని కార్మికుడు తెలిపాడు. వెంటనే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా బస్తీ దవాఖానాను సందర్శించి చికిత్సలు అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మందుల లభ్యత, నిత్యం వస్తున్న రోగుల సంఖ్య గురించి అక్కడి సిబ్బంది ఎమ్మెల్యేకు వివరించారు. ఎండ కాలం దృష్ట్యా అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు, సమస్యలున్న తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిక్కాల దత్తు, సాయి, రాము, రేఖ, ముకుంద్, గంగుబాయి, అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థుల యూనిఫామ్స్ అందజేత



జన్నారం : మండలంలోని వివిధ గ్రామాల్లో, మహిళా శక్తి కేంద్రాల ద్వారా విద్యార్థులకు కుట్టిన యూనిఫామ్స్‌ను సోమవారం ఎంపీడీవో శశికళ, ఎంఈఓ విజయ్‌కుమార్ ఏపీఎం బుచ్చన్నకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనిఫామ్స్‌ను చింతలపల్లి, లోతొర్రె, కొత్తూర్‌పల్లి, తిమ్మాపూర్, చింతగూడ, రోటిగూడ, అక్కపెల్లిగూడ 8 ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందిస్తామని తెలిపారు.

రిమ్స్‌లో నర్సింగ్ డే వేడుకలు



ఆదిలాబాద్‌టౌన్ : రిమ్స్‌కు వచ్చే రోగులను ఆప్యాయంగా పలకరిస్తు వారు కోలుకునే వరకు సేవలు అందిస్తు నర్సులు మన్నలు పొందుతున్నారని డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం రిమ్స్‌లో అంతర్జాతీయ నర్సింగ్ డేను పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ కేక్ కట్ చేసి నర్సులకు తినిపించారు. అనంతరం డైరెక్టర్‌తో పాటు పలువురు నర్సులను సత్కరించారు.

అందుబాటులో జీలుగా విత్తనాలు

సారంగాపూర్ : మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆలూరు, కౌట్ల(బి)లో జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి రాజశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమున్న రైతులు మంగళవారం నుండి సొసైటీల్లో తీసుకోవచ్చన్నారు. వీటిని ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తామన్నారు. 30 కేజీల బస్తా రూ.2790గాను రూ.1674 సబ్సిడీ పోను బస్తా రూ.1116 లభిస్తుందన్నారు. రైతులు పట్టాదారు పాసు బుక్కు, ఆధార్ జిరాక్స్ తీసుకొని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని వెల్లడించారు.

లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి

తలమడుగు : మండల రైతులు ఖరీఫ్ పంటలకు సిద్ధమవుతున్న వేళ విత్తనాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మహేందర్ తెలిపారు. మండలంలో మొత్తం 31 దుకాణాలు ఉన్నట్లు తెలిపారు. రైతులు లైసెన్స్ గల డీలర్ల వద్దనే పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. సంచులపై లేబుల్ నెంబర్, గడువు తేదీ తనిఖీ చేసిన తర్వాతనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే విత్తనాలను కొనుగోలు చేయాలని, ఒరిజినల్ బిల్లులను తీసుకొని జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు. మండలంలో ఎవరైన నాసిరకం విత్తనాలు, మందులు, ఎరువులు అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ఆదిలాబాద్‌టౌన్ : వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలు అందజేస్తుంది. ఆ పురస్కారాల కోసం ఆయా రంగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళలు, క్రీడలు, సామాజిక కార్యక్రమాలు, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, సాహిత్యం, విద్య, సివిల్ సర్వీసెస్ అంశాల్లో సాధించిన లక్ష్యాలు, చేసిన కృషిని 800 పదాలు మించకుండా జూన్ 3వ తేదీలోపు సంబంధిత వెబ్ సైట్ www.padmaawards.govలో నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసిన దరఖాస్తు ప్రతిని జిల్లా యువజన క్రీడల అధికారి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

నవతెలంగాణ-మంచిర్యాల

ఇష్టాను సారం ఫీజులు వసులు చేస్తూ, ఇంటర్నేషనల్, సిబిఎస్సీ, ఐసిఎస్ఇ పేర్లతో విద్యనందిస్తామని తప్పుడు ప్రచారం చేస్తున్న విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, ఈదునూరి అభినవ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో చార్వాక హాల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో రోజురోజుకూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వాహకులు చెలరేగిపోతున్నారని, పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడం వల్ల రూ.50వేల నుండి రెండు లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చేయాల్సిన అవసరముందన్నారు. ఇంటర్నేషనల్, సిబిఎస్సీ, ఐసిఎస్ఇ లాంటి పేర్లను ప్రచారం చేస్తున్న విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలన్నారు. సంస్థల ఫీజులను ప్రతి సంవత్సరం ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి సరైన కారణాలు ఉన్నప్పుడు మాత్రమే నిర్వహణ ఖర్చులు 15శాతం మించకుండా పెంచుకునేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులను ప్రతి సంవత్సరం



తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, విద్యావేత్తలు, జిల్లా స్థాయిలో కలెక్టర్, జడ్జి కమిటీ సభ్యులుగా ఉండి జిల్లా ఫీజు రెగ్యులేషన్ కమిటీ ఫీజులను నియంత్రణ చేసే వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు. పాఠశాలలను దుకాణాలుగా మార్చి,టై, బెల్ట్, పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారన్నారు. వీటిని కూడా అధికారులు నియంత్రించాలన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ నాయకురాలు యామిని, సీఐటీయూ నాయకులు దూలం శ్రీను, రైతు సంఘం నాయకులు సంకె రవి, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు బండి సత్యనారాయణ, టిఎజిఎస్ నాయకులు సమ్మక్క, కరీమా, చందు, రాజేశ్వరి, ఉమారాణి, సరిత, బోడక్క, శంకరక్క పాల్గొన్నారు.

అధిక ధరలకు విత్తనాలు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పత్తి విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు అమ్ముతున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఏఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పత్తి విత్తనాలను నోస్టాక్ పేరుతో కృత్రిమ కొరత సృష్టించి నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు పత్తి విత్తనాలను అమ్ముతున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రైతుల అమాయకత్వాన్ని, అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో కొన్ని దుకాణాలు, డీలర్లు సిండికేట్‌గా మారి అధిక ధరలకు అమ్ముతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ముఖ్యంగా మహారాష్ట్ర నుండి వచ్చే రైతులకు అధిక ధరలకు అమ్ముతూ స్థానికంగా ఉన్న రైతులకు విత్తనాలను అందుబాటులో ఉంచడం లేదని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారని, పూర్తి స్థాయిలో రైతులకు న్యాయం చేసే విధంగా జిల్లా వ్యవసాయ అధికారులు పని చేయాలన్నారు. జిల్లాలో విత్తనాల వివరాలను ఆయా దుకాణదారులు నోటీస్ బోర్డుపై ఉంచాలన్నారు. ఆధార్ కార్డుతో రైతులకు విత్తనాలు అమ్మేలా కలెక్టర్ చొరవ తీసుకోవాలని తెలిపారు. అధిక ధరలకు పత్తి విత్తనాలను అమ్ముతున్న దుకాణాల లైసెన్సు రద్దు చేయాలన్నారు. నకిలీ విత్తనాల భారీ నుండి రైతులను కాపాడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన ప్రతినిధి బృందంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తీక్, పురుషోత్తం, టికనంద్, శ్రావణి ఉన్నారు.

పరిజ్ఞానాన్ని అందిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాల్లో పరిజ్ఞానాన్ని అందించి పంట ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని కేవీకేలో సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహించారు. రైతులతో సమావేశం నిర్వహించి కేవీకే అందించే సేవలను వివరించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా రైతులకు వ్యవసాయంలో సాగు పద్ధతులు తెలియజేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. దేశ వ్యాప్తంగా 731 కేవీకే కేంద్రాలున్నాయన్నారు. వీటి ద్వారా రైతుల సమస్యలు, సాగు పద్ధతులు, అధునాత సాగు గురించి తెలియజేస్తున్నట్లు వివరించారు. కేవీకే అందించే సేవలను రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు కూడా శాస్త్రవేత్తలు చేస్తే సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, హార్టికల్చర్, పశు సంవర్ధక శాఖల అధికారులు రమేష్, సుధాకర్, కిషన్, అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీధర్ చౌహన్, శాస్త్రవేత్తలు రాజేందర్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన పత్తి, సోయాబీన్ విత్తనాలను రైతులకు అందించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న అన్నారు. సోమవారం పట్టణంలోని పంజాబ్ చౌక్‌లో ఉన్న షాపులను సందర్శించారు. విత్తన డీలర్లతో, విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులతో కలిసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా బొర్రన్న మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా సరిహద్దుల్లో మహారాష్ట్ర ఉండడంతో నకిలీ విత్తనాలు వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు ఆ విత్తనాలు తీసుకొని నష్టపోయే పరిస్థితి దాపురిస్తోందన్నారు. దీనిపైన జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు కలిసి నకిలీ విత్తనాలు అమ్ముకునే వారిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. నకిలీ విత్తనాలు తయారు చేస్తున్న వారిపైన పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసి విత్తన డీలర్ లైసెన్స్‌ను రద్దు చేయలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటనారాయణ, చిలుక దేవిదాస్, జగన్, సురేష్ ఉన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అన్నారు. సోమవారం వికాసం ప్రత్యేక పాఠశాలలో భారత్ దేఖో స్వచ్ఛంధ సంస్థ వారి సౌజన్యంతో ఐటీడీఏ ఉట్నూర్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు ఆట, పాటలతో బోధనలు చేయాలనీ, అలాగే డ్రాయింగ్, పేయింటింగ్‌లో శిక్షన ఇవ్వాలని సూచించారు. నాణ్యమైన బోధనతో పాటు ప్రతి రోజూ ఉదయం పాలు, బిస్కట్లు విరామం సమయంలో పండ్లు అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ కె.క్రాంతి కుమార్, నీతి అయోగ్ సీపీఓఆర్ రాహుల్, పీఎంఆర్సీ ఆర్పీఎం గోవింద వికాసం పాఠశాల ప్రిన్సిపాల్ వికాస్ పాల్గొన్నారు.



ఎండలు మండే... నీడ కరువాయే...

నవతెలంగాణ-నార్నూర్

రోజు రోజుకు ఎండ మండుతున్నాయి. జిల్లాలో అత్యధిక ఉష్ణాగ్రతలు పెరుగడంతో ప్రజలు, జంతువులు అల్లాడిపోతున్నాయి. మేత మేయడానికి వెళుతున్న పశువులు ఎండవెడిమికి అల్లాడిపోతున్నాయి. జిల్లాలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సోమవారం మేతకు వెళ్లిన పశువులు ఎండలకు ఇబ్బందులకు గురవుతున్నాయి. వేడికి తాళలేక చెట్టు పట్టున చేరి అక్కడే సేద తీరుతున్నాయి. అదేవిధంగా ఉదయం పది దాటిందంటే రోడ్లన్ని నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, ఉపాధి హామీ కూలీలు ఉదయం పనులకు వెళ్లి తొందరగా ముగించుకోవాలని, తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యసిబ్బంది పేర్కొన్నారు.



రిజర్వేషన్లు ఖరారు కాకముందే..

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి

- ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువత ఆసక్తి
- పట్టుకోసం ఎవరికి వారు ప్రయత్నాలు

నవతెలంగాణ-సిరికొండ

పల్లెల్లో గ్రామపంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. గత నవంబర్‌లో అసెంబ్లీ, తాజాగా పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఇక సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆశావాహులు అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నట్లు కనబడుతోంది. గ్రామాల్లో ఏ ఇద్దరు కలిసిన పంచాయతీ ఎన్నికల గురించే చర్చ సాగుతుందంటే అతిశయోక్తి లేదు. మాజీ సర్పంచులు, వార్డు సభ్యుల స్థానంలో ఈసారి మార్పు కోరుకుని కొత్తవారికి అవకాశం ఇవ్వాలంటూ పలు గ్రామాల వాట్సాప్ గ్రూపుల్లో చర్చలు జోరందుకున్నాయి. అక్టోబర్ తర్వాతే పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్నట్లు సంకేతాలు వచ్చిన ఆ మాత్రం ముందుగా ప్రయత్నాలు మొదలెట్టకపోతే ఎలా.. అంటూ పలువురు ఆశావాహులు పరోక్ష ప్రచారానికి తెరలేపుతున్నారు.

రిజర్వేషన్లు ఖరారు కాకముందే పట్టు కోసం పార్టీలో ప్రయత్నాలు...

ఇంకా రిజర్వేషన్ కూడా పూర్తి కాలేదు. కానీ పల్లెల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. రిజర్వేషన్లు ఖరారు కాకముందే పట్టు కోసం పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒకవేళ రిజర్వేషన్ వస్తుందా లేకపోతే కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది కదా రిజర్వేషన్లు మార్పులు చేర్పులు ఉంటాయని ఆశావాహులు మాత్రం గంపేడాశలతో ఉన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో సర్పంచ్ పదవికి పోటీ తీవ్రంగానే ఉంటుంది. రోజురోజుకీ రాజకీయ నిరుద్యోగిత పెరిగిపోతుంది. సర్పంచ్ పదవికి అధిక ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఒకవేళ రిజర్వేషన్ మగవారికి కాకుండా మహిళా రిజర్వేషన్ ఏర్పడితే వారి సతీమణులను కూడా ఎన్నికల్లో పోటీ చేయించడానికి సైతం ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా యువత కూడా ఈసారి గ్రామపంచాయతీ ఎన్నికల కోసం ఇప్పటినుండే పోటీ చేయడానికి నూతన ఉత్సాహం చూపుతున్నారు. గ్రామంలో సర్పంచ్ పదవికి ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈసారి పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఎన్నికల ఖర్చుకు సైతం లెక్కచేయకుండా ఉన్నారు. మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా గతంలో అధికార బీఆర్ఎస్ పార్టీ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంది. మండలంలో అధికంగా గిరిజన గ్రామ పంచాయతీలే ఉండగా అందులో నుంచి 9 ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. కానీ ఈసారి సర్పంచ్ ఎన్నికల కోసం ఖర్చు ఎంతయినా చేయడానికి సిద్ధమేనని ఆశావాహులు వ్యక్తం చేస్తున్నారు. దేశానికి రాష్ట్రపతి ప్రథమ పౌరుడు అయితే గ్రామానికి సర్పంచ్ ప్రథమ పౌరుడు, గ్రామాల్లో వివిధ రకాల ఎన్నికల్లో కంటే సర్పంచ్ పదవికి మాత్రం ప్రత్యేకత ఉంటుంది. చాలామంది నాయకులు తమ రాజకీయ జీవితం సర్పంచ్ పదవి నుంచి



మొదలైందే, ఈ పదవికి ప్రత్యేక స్థానం నెలకొంది. వేచి చూడాలి మరి ఏ గ్రామానికి ఏ రిజర్వేషన్ వస్తుందో ఎవరికి ఆ పదవిలో కూర్చునే అదృష్టం వస్తుందో...!

పలకరింపులతో ప్రజలతో మమేకం...

గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులు, వార్డు సభ్యుల పోటీ చేయాలని తలంపుతో ఉన్న ఆశావాహులు ప్రజలను మంచిగా చేసుకోవడంలో బీజీ అయ్యారు. ఏ పని లేకున్నా వార్డులో తిరుగుతూ కనిపించిన వారిని అవ్వ, తాత, బాబాయి, పిన్ని, అన్న, వదిన, తమ్ముడు, చెల్లి, అక్క తదితర వరుసలతో మాటల్లో పెడుతున్నారు. గ్రామాల్లోని సమస్యలు ఇంకా తాము చేయాల్సిన పనులను గుర్తిస్తూ ముందుకు సాగుతున్నారు. కాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కంటే అభ్యర్థి వ్యక్తిత్వం, ప్రజలకు అందుబాటులో ఉంటూ, నిస్వార్థ సేవ చేసే వారికి ప్రజలు పట్టం కడతారన్నది జగమెరిగిన సత్యం. అయినా ఎవరి ప్రయత్నంలో వారున్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీడీ కార్మికుల సంబరాలు



నవతెలంగాణ-నిర్మల్

బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న వివిధ కేటగిరీలకు చెందిన బీడీలు చుట్టే కార్మికులు బీడీ ప్యాకర్స్‌కు నెలసరి ఉద్యోగులకు వేతనాలు పెరగడంతో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ అనుబంధ సంస్థ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని, సోఫినగర్‌లోని బీడీ ఫ్యాక్టరీ ముందు టపాకాయలు పేలుస్తూ, సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న మాట్లాడారు. ఇటీవల బీడీ కార్మికుల యాజమాన్యాలతో సమావేశం సఫలమైందన్నారు, కార్మికుల వేతనాల పెరుగుదల కార్మికుల సమిష్టి కృషి ఫలితంగా జరిగిందని అన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధినిచ్చే బీడీ పరిశ్రమ రోజు రోజు నిర్వీర్యమై పోతుందని, బీడీ కార్మికులకు పని లేక అతి తక్కువ వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారిని ప్రభుత్వాలే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమపై 28 శాతం జీఎస్టీ, పుర్రెగుర్తు ఫిక్టోరియల్ వార్నింగ్, పెట్టడంతో బీడీ పరిశ్రమ తగ్గిపోయి ఉపాధి దొరకక కార్మికులు అర్ధాకలితో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధిని చూపాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమలో జీవన భృతి రాని కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జీవన భృతి ఆంక్షలు లేకుండా ఇవ్వాలని లేని ఎడలో త్వరలో ఆందోళన నిర్వహిస్తామని తెలియజేశారు. పెరిగిన వేతనాలు మే నెల నుంచి అమలు జరుపబడతాయని 1000 బీడీకి అదనంగా రూ.4-25పైసలు, బీడీ ప్యాకర్లకు నెలకు రూ.3,650, నెలసరి ఉద్యోగులకు రూ. 1700 పెరిగినట్లు పెరిగిన వేతనాలు తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మందికి అమలు జరుగుతాయని అన్నారు. ఈ అగ్రిమెంటు 2026 సంవత్సరం వరకు అమల్లో ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు కే.లక్ష్మి, గంగామణి, రాజేందర్, ఎల్లయ్య, రవి, వెంకటి, లక్ష్మణ్, కే.రాజు, మురళి, చిన్నయ్య రవి, కమల, కవిత, నరసవ్వ పాల్గొన్నారు.

రమాబాయి అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన మహనీయురాలు రమాబాయి అంబేద్కర్ అని మహామాయ ఉపాసిక సంఘం మండల అధ్యక్షురాలు సోమోరే మాయబాయి అన్నారు. సోమవారం ఇంద్రవెల్లి మండలంలోని మిలిందనగర్ కాలనిలోని త్రిరత్న బుద్ధ విహార్‌లో రమాబాయి అంబేద్కర్ 89వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మహామాయ ఉపాసిక సంఘం మండల అధ్యక్షురాలు సోమోరే మాయబాయి మాట్లాడుతూ దేశ ప్రజల కోసం అంబేద్కర్ చేస్తున్న పోరాటలకు రమాబాయి మద్దతుగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమం అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి కాంరాజ్, మహామాయా ఉపాసిక సంఘం సభ్యులు ప్రభావతి, మాయావతి, ఉషబాయి, లతబాయి, దళిత సంఘాల నాయకులు రాజవర్ధన్, గౌతం, లక్ష్మణ్, కమ్రబా, దీపక్, దయానంద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని వైకుంఠపూర్ గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త ఒడ్నం మోహన్ తల్లి రాజవ్వ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వీరి వెంటా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ్ రాజేశ్వర్, నాయకులు అహ్మద్ ముక్తార్, సురేందర్, మారుతి, చిన్నయ్య దేవేందర్, ప్రవీణ్, సాయందర్ ఉన్నారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

- ఎంపీ(చింద్వాడ) టమాటా ఆదిలాబాద్‌కు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇటు ఉక్కపోత ఎండతో పాటు అటు కూరగాయల ధరలు సైతం భగ్గుమంటున్నాయి. దీంతో రోజు కూలీ నాలీ చేసే వారు సామాన్య మధ్యతరగతి కుటుంబాలు కూరగాయలు కొనాలంటే ఒక అడుగు వెనుకకు వేసి ఆలోచిస్తున్నారు. ఇక మున్ముందు వీటి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. సోమవారం ఇంద్రవెల్లి వారాంతపు సంతలో వివిధ కూరగాయల ధరలు ఇంతింతై.. వటుడింతై.. అన్నటుగా పెరుగుతూనే ఉన్నాయి. గత వారం కింద జరిగిన వారాంతపు సంత కంటే ఈ సారి కిలో కూరగాయాలపై రూ.20 నుంచి 30 పెరిగినట్టు వినియోగదారులు వాపోతున్నారు. సోమవారం జరిగిన వారాంతపు సంతలో కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాటా కిలో రూ.60, పచ్చి మిర్చి రూ.100, బీరకాయలు రూ.120, కాలీఫ్లవర్ రూ.100, క్యాబేజీ రూ.80, బెండా రూ.80, వంకాయ రూ.60, అల్చందా రూ.80, ఎల్లిగడ్డ కిలో రూ.160 పలుకుతోంది. గత వారం కిలో రూ.20 పలికిన టమాటా ధర ప్రస్తుతం రూ.60 పలుకడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత వల్ల ఉమ్మడి జిల్లాలో టమాటా పండటం లేదని, నిజామాబాద్ జిల్లా అంకాపూర్, చిత్తూర్ జిల్లా మదినపల్లె, లాతూర్ జిల్లా మహారాష్ట్ర నుంచి సైతం టమాటా సప్లై కావడం లేదని, వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మన జిల్లాకు మధ్యప్రదేశ్ చింద్వాడ నుంచి టమాటా వస్తున్నట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో టమాటా కిలో వందకు చేరువలో ఉంటుందని వ్యాపారస్తులు పేర్కొంటున్నారు.

అసంక్రమిత వ్యాధుల నివారణపై అవగాహన




నవతెలంగాణ-లక్ష్మణచాంద

అసంక్రమిత వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వైద్యురాలు డాక్టర్ ప్రత్యూష ఆధ్వర్యంలో మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సమాజ స్థాయిలో సంరక్షణ కొరకు ఇంటింటికి వెళ్లి అసంక్రమిత వ్యాధులు అయినటువంటి మధుమేహము, రక్త పోటుతో బాధపడుతున్న వారిని గుర్తిస్తూ గ్రామంలో 30 సంవత్సరాల పైబడిన వారందరికీ పరీక్షలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు దీర్ఘకాలిక ఆహారపు అలవాట్లు ఆరోగ్య నియమాలు గురించి తెలిపారు. వ్యాధులు రావడానికి గల కారణాలు గురించి వివరణ ఇస్తూ తగిన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు శివకృష్ణ గౌడ్, ఆరోగ్య కార్యకర్త సుజాత, ఆశా కార్యకర్తలు రమ, కల పాల్గొన్నారు.

మురుగు పారదు..కంపు వదలదు..

నవతెలంగాణ-నేరడిగొండ

పరిశుభ్రంగా ఉండాల్సిన గ్రామాలు నిండిన చెత్తతో, నిలిచిన నీరుతో దర్శనమిస్తున్నాయి. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ప్రత్యేకాధికారులకు ఇన్‌చార్జీ బాధ్యతలు ఉండటంలో గ్రామాలను పూర్తిస్థాయిలో పర్యవేక్షించలేక పోతున్నారని ఆయా గ్రామాల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వాంకిడి గ్రామపంచాయతీలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం నిండి, దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాటు నిలిచి ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ దోమలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇప్పటికైన సంబంధితశాఖ అధికారులు గ్రామాన్ని సందర్శించి మురుగు కాలువలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.



నకిలీ పత్తి విత్తనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

నకిలీ పత్తి విత్తనాలు అరికట్టేందుకు అధికారులు నిర్లక్ష్యం వీడి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఆరెల్లి మల్లేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఫెర్టిలైజర్స్ షాపులలో, విత్తన దుకాణాలకు ఎలాంటి లైసెన్స్ లేకుండా కనీస అనుభవం లేకుండా అధికారులు పలు దుకాణాలకు అక్రమంగా అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే నకిలీ పత్తి విత్తనాలు మార్కెట్లో యదేచ్ఛగా అమ్ముతున్నట్లు ఆరోపించారు. ఇటీవల దొరికిన నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్న సామ అశోక్‌రెడ్డి, రాజేందర్‌లపై పీడియాక్టు కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలనీ కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు, లేనిపక్షంలో రైతులతో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బరుకుంట సుభాష్, మండల అధ్యక్షులు చిట్టి రవి, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పసుల శ్రీకాంత్, టౌన్ అధ్యక్షులు దుబాక చందు, రాజేశ్వర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

వేసవి దుక్కులకు ఇదే సరైన సమయం

- వానాకాలం పంటల్లో తెగుళ్లు, కలుపు మొక్కలు
- నివారణకు దుక్కులు దున్నడం ఉపయోగకరం



నవతెలంగాణ-ఇచ్చోడ

రైతులు వేసవి దుక్కులు దున్నడం వలన అనేక ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. రైతులు రబీ పంటలు కోతల అనంతరం నేలను అలానే వదిలేయకుండా దుక్కిదన్ని ఉంచాలని అన్నారు. తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. లోతు దుక్కులతో భూమిపై పొరలు కిందికి పైపొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుందని తెలిపారు. ఇలా భూమిలో తేమ శాతం పెరిగి భూసారం అభివృద్ధి, పురుగులు తెగుళ్ల యజమాన్యం కలుపు మొక్కల నివారణ ప్రయోజనాలు సమకూరుతాయి. వేసవి దుక్కులు దున్నే ముందు పశువుల పెంట, కంపోస్ట్ ఎరువు, మట్టిని వెదజల్లడం ద్వారా పంటల దిగుబడి పెరుగుతుంది.

భూసారం పెరిగే అవకాశం ఎక్కువ...

వేసవి దుక్కులు లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలి, వాలుగా, అడ్డంగా దున్నుకోవడం వల్ల నీరు భూమిలోకి ఇంకెందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహించి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వేసవి దుక్కులు దున్నే ముందు గొర్రెలు, పశువులు మందలు తోడటం వల్ల అవి విసర్జించిన వ్యర్థాలు భూమిలోకి చేరి సేంద్రియ పదార్థం తయారవుతుంది. దీని ఫలితంగా భూసారం వృద్ధిలోనూ ఎంతగానో ఉపయోగపడుతుంది. రైతుల పంటల నుంచి వచ్చే ఆకులు చెత్త కాల్చి వేయకుండా లోతు దుక్కులు దున్నడం మూలంగా పంట చెత్త చేదారం ఎండు ఆకులు నేల పొరల్లో కలిసిపోయి ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది.

క్రిమి కీటకాలు నాశనం..

వేసవిలో చాలావరకు భూమి ఖాళీగా ఉంటుంది. అలాంటి సమయంలో పంటలను ఆశించే, అనేక రకాల పురుగులు పంట కోత దశలో వాటి నిద్ర వస్త దశలను నేల, చెత్త చెదారం, కొయ్య కాండాలలో గడుపుతాయి, తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు తదితరమైనవి భూమి లోపల ఆశ్రయం పొందుతాయి. వీటి శిలీంద్ర బీజాలు భూమిలో నిలువ ఉంటాయి, వేసవి లోతు దుక్కుల వలన నిద్ర వస్తా దశలో భూమిలోని చీడపురుగులు, కోశాలు, లార్వాలు గుడ్లను పక్షులు, కొంగలు కాకులు తిని వాటిని నాశనం చేస్తాయి. అదేవిధంగా వేసవి దుక్కుల వల్ల భూమి లోపల పొరలో ఉన్న శిలీంద్ర బీజాలు నేలపైకి వస్తాయి. బయట ఉష్ణోగ్రతలతో అవి చనిపోతాయి.

దుక్కులు దున్నకుంటే జరిగే నష్టాలు..

చాలా మంది రైతులు వానకాలం యాసంగి పంట పండిన తరువాత తిరిగి వర్షాకాలం వచ్చే వరకు భూమిని వదిలేస్తారు. అలా చేయడం వల్ల కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటి పోషకాలను గ్రహించి భూమికి సత్తువ లేకుండా చేస్తాయి, ఫలితంగా భూసారం తగ్గిపోవడమే కాకుండా భూమి లోపల పొరల నుంచి నీరు గ్రహించుకొని ఆవిరైపోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా భూమిలో ఉండేటువంటి క్రిమి కీటకాలు చనిపోకుండా ఉండి వాటి స్థావరాలు విస్తరించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

రైతు వేదికల్లో అవగాహన కల్పిస్తున్నాం

కైలాస్, మండల వ్యవసాయ అధికారి



పంటలపై, పంటల దిగుబడిపై మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న రైతు వేదికలలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు నేలలో సేంద్రియ కార్బనం, పెరగడానికి పెసర వంటి పంటలు వేయాలి, వేసవి దుక్కుల వల్ల పంటలకు హాని చేసే కీటకాల కోశస్త దశలో ఎండకు చనిపోవడం ద్వారా పంటలు ఆరోగ్యంగా ఉంటాయి. ముఖ్యంగా పత్తి పంటలు గులాబీ రంగు పురుగులు ప్యూప దశలో నశిస్తాయి.

రేపు మాదిగ మహాకూటమి చైర్మెన్ కిరణ్ రాక

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మాదిగ సంఘాల మహా కూటమి తెలంగాణ రాష్ట్ర చైర్మన్ పోకల కిరణ్ కుమార్ మాదిగ బుధవారం కాగజ్‌నగర్ రానున్నట్టు మాదిగ సంఘాల మహకూటమి ఉమ్మడి అధిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఇరిగిరాల భాస్కర్ మాదిగ తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాదిగ సంఘాల నాయకులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల మహకూటమి నాయకులు గొడిసెల రవి, బొమ్మెన శ్రీనివాస్, కొగిలా శ్రీమాన్, సిద్దెలా దేవన్న, గొగర్ల నరేష్, చిల్కుల సురేష్ మాదిగ, గోగర్ల కుమార్ మాదిగ, నక్కా శంకర్ మాదిగ పాల్గొన్నారు.

ఫూలే ఆశయ సాధన దిశగా సాగాలి

నవతెలంగాణ-వాంకిడి



మహాత్మ జ్యోతి పూలే ఆశయ సాధన దిశగా ముందుగా జడ్పీటీసీ అజయ్ కుమార్ అన్నారు. మండలంలోని తేజుగుడాలో సోమవారం మహాత్మ జ్యోతిరావు పూలే మహాత్మ సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ మహిళాల చదువు కోసం సావిత్రి బాయి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆమెను ఆదర్శంగా నేటి మహిళాలు రాణించాలని సూచించారు. అదే విధంగా సమాజంలో రుగ్మాతలను తొలగించడానికి మహాత్మ జ్యోతి పూలే కూడా అనేక కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, మెంగాజీ, శంకర్ పాల్గొన్నారు.

గిరి విద్యార్థులకు సృజనాత్మక శిక్షణివ్వాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలలో విద్యార్థులకు సృజనాత్మక శిక్షణ ఇవ్వాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అన్నారు. ఆసిఫాబాద్ మండలం వట్టివాగు దిశ మోడల్ పాఠశాలలో భారత్ దేఖో స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని ఖుష్బు గుప్తా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి శిబిరాల్లో ఎప్పుడూ నేర్పించే పాఠాలే కాకుండా కొత్తదనం ఉండాలని, ఆటపాటలతో వారిలోని సృజనాత్మకతను వెలికితీయాలని సూచించారు. పిల్లలకు ఏయే అంశాలపై ఆసక్తి ఉందో తెలుసుకుని వారిలో ఉన్న ప్రతిభని గుర్తించాలన్నారు. అలాగే పిల్లలకు అందించే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని ఆదేశించారు. ప్రతిరోజూ పిల్లలకు పాలు, బిస్కట్లు, పండ్లు అందించాలని తెలిపారు. రవాణా సౌకర్యం ఏర్పాటు చేసి వాలంటీర్లు వారిని ఇంటి వద్ద దింపాలని సూచించారు. ఆర్ఆర్ కాలనీ, పాడిబండలోని మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. పిల్లలకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని, వారికి ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. పిల్లలకు అవసరమైన పౌష్టికాహారాన్ని సమయానుసారంగా అందించాలన్నారు. ఆర్ఆర్ కాలనీలో గల అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. నాణ్యమైన ఆహారాన్ని అందించడంలేదని పరిశీలనలో గుర్తించి అంగన్‌వాడీ సెంటర్ సూపర్‌వైజర్, ఆయాకు షోకాజ్ నోటీసులిస్తూ సస్పెన్షన్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఎసీఎంఓ పుర్కా ఉద్దవ్, సహాయ గిరిజన సంక్షేమ అధికారి క్షేత్రయ్య, ఎస్సీఆర్పి రాథోడ్ రవీందర్, భారత్ స్వచ్చంద సంస్థ వాలంటీర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సీఆర్టీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో అధిక కేసులు వచ్చేలా చూడాలి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె. యువరాజ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. యువరాజ్ అన్నారు. జూన్ 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంపై సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థాన భవన సముదాయంలో పోలీసుశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో రాజీ మార్గం ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కక్షిదారులకు అవగాహన కల్పించాలని, కేసులను రాజీకి వచ్చే విధంగా చేయడం ద్వారా కక్షిదారుల సమయం, డబ్బులు ఆదా చేసుకోవచ్చని తెలియజేయాలని, స్టేషన్ల వారీగా కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సైబర్ క్రైమ్ కేసులు అధిక సంఖ్యలో రాజీ చేయడంతో పాటు అందించిన వారి సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్, జైనూర్ సీఐలు సతీష్, కె. అంజయ్య, ఎస్సైలు చంద్రశేఖర్, ప్రవీణ్, విజయ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు క్రీడా దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఆధ్వర్యంలో నెల రోజుల నుంచి కొనసాగుతున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగుంపు వేడుకలను సోమవారం గోలేటిలోని సీఈఆర్‌లో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జీఎం డి.రవిప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులు ఆసక్తి ఉన్న ఆటలో నైపుణ్యాన్ని పెంచుకుని జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇందులో భాగంగా శిక్షకులతో పాటు కోల్ ఇండియా స్థాయి పవర్ లిఫ్టింగ్ 57కేజీల విభాగంలో మూడవ స్థానం సాధించిన ఎస్.అనురాధ, వెయిట్ లిఫ్టింగ్ 55 కేజీల విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన ఎంయూ.భాస్కర చారిలను సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం జిమ్, స్విమ్మింగ్ పూల్‌లను సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్ఓ టూ జీఎం ఎం.నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరి రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాలంకు ముందుగా విద్యుత్ లైన్‌ల చెకింగ్‌లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో విద్యుత్ సరఫరాలలో అంతరాయం ఉంటుందని ఏఈ సదాశివ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 11 గంటల వరకు జనకాపూర్, కోర్టు రోడ్డు, అటవీశాఖ కార్యాలయం, ఎన్జీఓ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

లైసెన్స్ రెన్యువల్‌కు డబ్బులు డిమాండ్

- రూ.38 వేలు తీసుకుంటు అడ్డంగా దొరికిన ఏఓ
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ

నవతెలంగాణ-దహెగాం



ఏసీబీకి పట్టుబడిన ఏఓ వంశీకృష్ణ

ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో విత్తన, ఎరువుల దుకాణాల దారులు తమ లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి వంశీకృష్ణ దానికి సదురు డీలర్ నుంచి డబ్బులను డిమాండ్ చేశారు. లంచం ఇవ్వలేని బాదితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో ప్రణాళిక ప్రకారం రంగంలో దిగిన ఏసీబీ డీఎస్పీ వీవీ.రమణమూర్తి ఏఓకు డబ్బులు ఇచ్చే క్రమంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిలికన్ పరీక్ష నిర్వహించి ఏఓను అదుపులోకి తీసుకుని కరీంనగర్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ ఫెర్టిలైజర్ దుకాణం రెన్యువల్ కోసం చౌదరి శ్యామ్‌రావ్ వద్ద నుంచి రూ.38వేలు లంచాన్ని ఏఓ డిమాండ్ చేసినట్టు ఫిర్యాదు వచ్చిందన్నారు. ఐనం గ్రామానికి చెందిన చౌదరి శ్యామ్ రావ్ తనకున్న మారుతి ట్రేడర్స్‌లో ఫెర్టిలైజర్, సీడ్స్ రెన్యూవల్ కోసం ఏప్రిల్ 27న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడని తెలిపారు. మే 7న ఫెర్టిలైజర్ లైసెన్స్ రెన్యువల్ కాగా సీడ్స్ లైసెన్స్‌లో చిరునామ తప్పుగా పడిడడంతో సరి చేయడానికి మండల వ్యవసాయ అధికారి లంచం డిమాండ్ చేశాడన్నారు. ఫెర్టిలైజర్ లైసెన్స్ రెన్యువల్‌కు రూ.20వేలు, సీడ్ లైసెన్స్ రెన్యువల్‌కు రూ.18 వేలు మొత్తం రూ.38 వేలు ఇస్తేనే సరిచేస్తానని, లేకుంటే చేయనని చెప్పడంతో బాదితుడు ఒప్పుకొని తమను శుక్రవారం ఆశ్రయించాడన్నారు. దీంతో కేసు వివరాలు తెలుసుకుని సోమవారం బాధితుడి నుండి రూ.38 వేలు రూపాయలు మండల కేంద్రంలో తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. విచారణ అనంతరం రిమాండ్‌కు తరలిస్తామని వివరించారు. గతంలో చెన్నూర్‌లో పని చేసిన సమయంలో కూడా అవినీతి ఆరోపణాల కారణంగా సస్పెండ్ అయి ఇటీవలే విధుల్లో ఏఓగా మండల కేంద్రానికి వచ్చారు. ఈ దాడిలో ఏసీబీ కరీంనగర్ రేంజ్ ఇన్స్‌పెక్టర్ కృష్ణ కుమార్, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వలేకనే ఏసీబీని ఆశ్రయించా

చౌదరి శ్యామ్ రావు, బాధితుడు



నాది చిన్న వ్యాపారం. లైసెన్స్ రెన్యువల్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న. వెరైఫికేషన్ కోసం ఏఓ వంశీకృష్ణ వచ్చారు. డబ్బులు ఇస్తేనే రెన్యువల్ అవుతుంది లేకుంటే చేయడం కుదరదని ముందే చెప్పారు. కానీ డబ్బులు లేక రేపు మాపు అంటూ వచ్చాను. అప్పటికి ఫెర్టిలైజర్ లైసెన్స్ రెన్యువల్ అయింది. సీడ్ రెన్యువల్‌లో అడ్రెస్ తప్పు ఉండటంతో ఇక డబ్బులు మొత్తం రూ.38 వేలు ఇస్తేనే చేస్తా లేకుంటే కుదరదని తేల్చి చెప్పడంతో డబ్బులు లేక ఏసీబీని ఆశ్రయించాను.

విత్తనాల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి

- రైతులకు వ్యవసాయ అధికారుల సూచన
- గ్రామాల్లో అవగాహన

నవతెలంగాణ-దహెగాం

రైతులు నాసిరకం విత్తనాలు, ఎరువులు కొని మోసపోవద్దని వ్యవసాయ విస్తరణ అధికారులు లక్ష్మీ, సుష్మిత అన్నారు. సోమవారం మండలంలోని గిరవెల్లి, ఇట్యాల, గొరెగ్రుట్ట, బోర్లకుంట గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాసిరకం విత్తనాలు, ఎరువులు వినియోగించడం వల్ల పంటలు పండక తీవ్రంగా నష్టపోతారన్నారు. ముఖ్యంగా విడి గింజలు నాసిరకం విత్తనాలని సూచించారు. తీసుకున్న వాటికి రశీదు తీసుకోవాలన్నారు. రైతులకు పంటలపై ఎలాంటి సందేహాలు, సమస్యలు ఎదురైనా వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



దహెగాం

బెజ్జూర్ : మండలంలోని పోతేపల్లి, ముంజంపల్లి, బారెగూడ గ్రామాలలో నకిలీ విత్తనాలపై ఏఓ రాజుల నాయుడు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన దుకణాలలో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఎవరైన లూజ్ విత్తనాలు అమ్మినట్టు వ్యవసాయశాఖ వారికి తెలిజేయచేయాలన్నారు. విత్తనాలు కొన్నప్పుడు బిల్లు తప్పని తీసుకోవాలని సూచించారు. రైతుకు ఇచ్చిన బిల్‌లో లాట్ నంబర్, వెరైటీ పేరు, ఎక్స్‌పైరీ వంటి విషయాలు ఉన్నావా లేవా అన్నది తీసుకున్న ప్యాకెట్‌తో సరిపోల్చుకోవాలన్నారు.

వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువులు ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉట్ సారంగపల్లి ఏఈఓ రవితేజ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : నకిలీ విత్తనాలను కొని రైతులు మోసపోవద్దని వ్యవసాయ విస్తరణాధికారి సృజన సూచించారు. మండలంలోని వంజీరి గ్రామంలో రైతులతో విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని వివరించారు. విత్తన ప్యాకెట్ల మీద ఉన్న లేబుల్, తయారీ తేదీ, ముగింపు తేదీ, వివిధ నంబర్ వివరాలను చూసి కొనుగోలు చేసుకోవాలని చెప్పారు. విడి గింజలు, నాసీరకం విత్తనాలు, నాసీరకం మందులు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. తీసుకున్న ప్రతీదానికి తప్పనిసరిగా రశీదు పొందాలన్నారు.



బెజ్జూర్



కాగజ్‌నగర్ రూరల్

పాఠశాలల పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మత్తు పనులను వేగవంతం చేసి పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఈఓ అశోక్‌తో కలిసి పాఠశాలల పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య బోధన అందించేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి పనులను చేపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలలో తాగునీరు, విద్యుదీకరణ, మూత్రశాలలు, ఇతర మరమ్మత్తు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు మండల విద్యాధికారులు, మండల నోడల్ అధికారులు ప్రతి పాఠశాలను సందర్శించి పనుల పురోగతిపై పర్యవేక్షించాలని, జరిగిన పని స్థాయి తెలిసే విధంగా పనుల వద్ద ఫోటోలు దిగి పోర్టల్‌లో నమోదు చేయాలని, 15 రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు గ్రామ సమాఖ్య సంఘ సభ్యులకు సమన్వయంతో ఇంకా పనులు ప్రారంభం కానీ పాఠశాలలలో వెంటనే పనులు ప్రారంభించాలని, రూపొందించిన ప్రణాళికా ప్రకారంగా పనులు చేపట్టి 100 శాతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, మండల విద్యాధికారులు, నోడల్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

జైనూర్‌లో కొనసాగిన ఆపరేషన్ చబుత్రా



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మల్లేష్

నవతెలంగాణ-జైనూర్

మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి ఆపరేషన్ చబుత్రాలో 30 మంది యువకులను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ నిర్వహించారు. సోమవారం జైనూర్ సీఐ మల్లేష్ విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలియజేశారు. మండల కేంద్రంలో ఎలాంటి అవసరం లేకున్న అర్ధరాత్రుళ్ల రోడ్లపై తిరుగుతూ కొందరు నానా హంగామా చేస్తుంటారన్నారు. మద్యం మత్తులో రెచ్చిపోతూ ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. బైక్‌లపై తిరుగుతూ వెకిలి చేష్టలకు పాల్పడుతున్న ఇలాంటి వారికి అడ్డుకట్ట చేసేందుకు ఆపరేషన్ చబుత్రాను చేపట్టినట్టు పేర్కొన్నారు. ఎస్పీ కే సురేష్ కుమార్ ఆదేశాలతో డీఎస్పీ సదయ్య ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి ఆపరేషన్ బబుత్రాను నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అర్ధరాత్రి దాటిన తర్వాత రోడ్లపై బైక్‌లతో తిరుగుతూ అసాంఘిక చర్యలకు పాల్పడుతున్న యువతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. దాదాపు 30మంది యువకులను అదుపులోకి తీసుకున్నామన్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఎవరూ కూడా అకారణంగా రోడ్లపైన తిరగవద్దని ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ అమలులో ఉందని తెలిపారు. అనవసరంగా బయటకు తిరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో జైనూర్, సిర్పూర్(యు) ఎస్సైలు సందీప్ కుమార్, మాధవ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- ఎస్పీ సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చే ఉద్దేశంతో నూతనంగా తీసుకువచ్చిన మూడు చట్టాలపై పోలీసులు అవగాహన పెంచుకొని ఆచరణలో పెట్టాలని ఎస్పీ సురేష్ కుమార్ పోలీసులకు సూచించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలపై జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా రూపొందించిన మూడు చట్టాలు రానున్న జూలై 1 నుండి అమలులోకి రానున్నాయన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఈ మూడు చట్టాలు భారత శిక్షా స్మృతి (ఐపీసీ), 1860బీ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (క్రిపీసీ), 1973బీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872లను రీప్లేస్ చేయనున్నాయన్నారు. ఈ మూడు కొత్త చట్టాలు నేరస్తులకు శిక్ష వేయడంతో పాటు బాధితులకు న్యాయం అందించడంపైన ఎక్కువ దృష్టి పెడతాయన్నారు. క్రిమినల్ చట్టాలు మారుతున్న కాలం, అవసరాలకు అనుగుణంగా నవీకరించబడ్డాయన్నారు. జిల్లా పోలీసులకు శిక్షణను డీసీఆర్‌బీ సీఐ రమేష్, ఎస్‌బీ ఎస్సై రామకృష్ణ, ఏఎస్ఐ జమీల్ పాషలు ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రమశిక్షణతో శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిచేసుకుని చట్టాల పైన పూర్తి అవగాహన తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు

- ఎస్సై దీకొండ రమేష్

నవతెలంగాణ-సిర్పూర్(టి)



నకిలీ పత్తి విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేయడానికి యత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ధీకొండ రమేష్ హెచ్చరించారు. మండలంలోని భూపాలపట్నం గ్రామ శివారులో సోదాలు నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి రెండు ప్లాస్టిక్ సంచులలో మూటగా కట్టి అనుమానస్పదంగా నడుచుకుంటూ వస్తుండగా అతడిని తనిఖీ చేశామన్నారు. అతని వద్ద 20 కిలోలు నకిలీ పత్తి విత్తనాలు లభ్యమాయ్యయని, వీటి విలువ రూ.50వేలు ఉంటుందని తెలిపారు. చింతలమానేపల్లి మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన చాపిలె పురుషోత్తం, మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన బొల్లబోయిన అశోక్, నీకోడే తిరుపతిలుగా గుర్తించామన్నారు. వీరు అమాయక రైతులకు నకిలీ పత్తి విత్తనాలను అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారని తమ విచారణలో తెలిసిందన్నారు. విత్తనాలను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని మండల వ్యవసాయ శాఖ అధికారి మధులత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారి వివరాలను పోలీసు నెంబర్లు 8712670544, 7032463001 సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్



నవతెలంగాణ-బెజ్జూర్

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బెజ్జూర్‌కు చెందిన ఇట్యాల సీతారాం కుటుంబాన్ని సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ పరామర్శించారు. బాదిత కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ప్రమాదం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తక్షణ సాయం కింద ఆర్థికసాయాన్ని అందజేశారు.సెలుగుపెల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం సోమరిలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, మండల పార్టీ అధ్యక్షుడు భూస శంకర్, కాంగ్రెస్ నాయకులు నాహిర్ అలీ, పుల్లూరి సతీష్, తంగడపల్లి మహేష్, జావిద్ అలీ, జావిద్ హుస్సేన్, షౌకత్ అలీ ఉన్నారు.

ముందుకు వచ్చిన దాతలు

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-కౌటల

గిరిజన పిల్లలు ముగ్గురు అనాథలుగా మారడంతో నవతెలంగాణ అయ్యోపాపం అనే శీర్షికన వార్త కథనాన్ని ప్రచురించింది. దీన్ని చూసి ఉదార స్వభావులు ముందుకు వచ్చి కుటుండానికి అండగా ఉంటాయని ఆర్థిక సాయాన్ని అందించారు. కొందరు దాతలు బిడ్డల ఆలనాపాలనా చేసేందుకు కూడా ముందుకు వచ్చారు. మండల కేంద్రానికి చెందిన కొందరు డబ్బులను జమ చేసుకొని కుటుంబ సభ్యులకు అందించనున్నారు. దాతలు మరింత మంది ముందుకు రావాలని కోరుతున్నారు. మానవీయ కోణంలో నవతెలంగాణలో కథనాన్ని ప్రచురించినందుకు మండల వాసులు అభినందనలు తెలుపుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల కొట్టివేత పనుల కారణంగా మంగళవారం సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ట్రాన్స్‌కో టౌన్ ఏఈ కమలాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఓల్డ్ కాలనీ, ఈఎస్ఐ ఏరియా, వెంకటరమణ థియేటర్ ఏరియా, వసుంధర కాలేజ్ ఏరియా టీచర్స్ కాలనీలకు సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

తోటి మిత్రుడికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీకి చెందిన నగ్నూరి శ్రీనివాస్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తన పదవ తరగతి 1993-94 బ్యాచ్‌కు చెందిన జన్నారం ప్రభుత్వ పాఠశాల తోటి మిత్రులు చందాలు వేసుకొని రూ. 26200 ఆర్థిక సాయం సోమవారరి అందించారు. ఈ సందర్భంగా బ్యాచ్ మిత్రులు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా శ్రీనివాస్ కూతురు పైచదువుల కోసం అండగా నిలుస్తామని ఈ సందర్భంగా వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మిత్ర బృంద సభ్యులు గొల్లపల్లి వెంకటరమణ, దరాజుల రాజన్న, ఫజల్ ఖాన్, ఎస్‌కె మక్సుద్, ఓదెలు పాల్గొన్నారు.

చెరువు పూడికతీత పనుల పరిశీలన

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని ఇందన్‌పల్లి గ్రామ శివారులో చేపట్టిన చెరువు పూడిక తీత పనులను సోమవారం ఎంపీడీఓ శశికళ పరిశీలించారు. సోమవారం ఆమె ఆ గ్రామంలో పర్యటించి ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపట్టిన చెరువు పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం అధికారులకు, కూలీలకు పలు సూచనలు చేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా కూలీలు ఉదయాన్నే పనులకు రావాలన్నారు. మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ-నస్పూర్

నూతన చట్టాలపై పోలీసు సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని రామగుండం కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. సోమవారం జూలై 1 నుంచి భారత ప్రభుత్వం నూతన నేర న్యాయ చట్టాలు-2023 అమలులోకి తేనున్న నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి పోలీసు అధికారికి, సిబ్బందికి నూతన చట్టాలపై అవగాహన ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి, ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, స్టేషన్ బెయిల్‌కు ఎవరు అర్హులు, చార్జీషీట్ ఎలా తయారు చేయాలి అనే అంశాలను వివరించారు. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని అవసరాన్ని బట్టి ప్రజా భద్రత కోసం ఎన్నో చట్టాల రూపకల్పన జరిగిందన్నారు. ఇప్పుడు అమలులోకి రానున్న నూతన చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం వంటి అంశాలతో శాంతిభద్రతల పరిరక్షణలో మైలురాయిగా నిలుస్తోందన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నూతన అంశాలను నేర్చుకోవాలని సూచించారు. ఇంత కాలం పాటిస్తున్న పాత విధానాలలో నూతన చట్టాలకు విరుద్ధమైన వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ పాటించకూడదని, నూతన సెక్షన్ల ప్రకారం మాత్రమే వివిధ రకాల కేసులను నమోదు చేయాలని సూచించారు. కమీషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులకు, సిబ్బందికి తెలంగాణ పోలీస్ అకాడమీలో నూతన చట్టలపై శిక్షణ పొందిన అధికారులతో బ్యాచ్‌ల వారిగా నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సిసిఆర్బీ ఇన్స్‌పెక్టర్ బుద్దె స్వామి, కమీషనరేట్ పరిధిలోని సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

బస్టాండ్లలో భద్రత కరువు

● వరుస దొంగతనాలతో ప్రయాణికుల బెంబేలు
● నగదు, సెల్‌ఫోన్ చోరీ కేసుల నమోదు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండుల్లో ప్రయాణికులకు భద్రత కరువైంది. అవుట్ పోస్టులు ఏర్పాటు చేసి ప్రయాణికులకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ అధికారులు బస్టాండ్‌ల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రతిఫలంగా జేబు దొంగలు రెచ్చి పోతున్నారు. ప్రయాణికులే టార్గెట్‌గా పెట్టుకొని అందిన కాడికి దోచుకుంటున్నారు. వారం రోజుల క్రితం మంచిర్యాల బస్టాండ్‌లో ప్రయాణికులు బస్సు ఎక్కే సమయంలో ఒక దొంగ చోరీకి ప్రయత్నించిన విధానాన్ని కొందరు యువకులు సెల్ ఫోన్‌లలో వీడియో చిత్రీకరించారు. ప్రస్తుతం అది సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.

బస్టాండ్‌లో పెరిగిన రద్దీ

వేసవి కాలం సెలవులు, మహిళలకు బస్ కూడా ఫ్రీ కావడంతో చాల వరకు మహిళలు, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆర్టీసీ బస్‌లో ప్రయాణం చేసేందుకు ఇష్ట పడుతున్నారు. దీనితో బస్టాండ్‌తో పాటు పరిసర ప్రాంతాలు అన్ని రద్దీగా మారుతున్నాయి. జిల్లా కేంద్రం కావడంతో చుట్టూ ప్రక్కల ప్రాంతాల నుంచి దాదపు ఉద్యోగులు, వ్యాపారస్తులు, నిత్యం వందల మంది మంచిర్యాల ఆర్టీసీ బస్‌ల ద్వారా ప్రయాణం కొనసాగిస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న కొందరు జేబు దొంగలు నిత్యం బస్టాండ్‌లలో కాపు కాసి అమాయకులైన ప్రయాణికులను గుర్తించి వారి వద్ద ఉన్న సెల్ ఫోన్‌లు, వారితో ఉన్న నగదును ఈజీగా దొంగ తనం చేస్తున్నారు. ప్రయాణికుల మాదిరి గానే తోటి ప్రయాణికులతో బస్‌లలో ప్రయాణం చేస్తూ సమయం దొరగ్గానే ప్రయాణికుడి వద్ద నుంచి పర్సు, సెల్ ఫోన్ కొట్టేసి అక్కడి నుండి మెల్లిగా జారుకుంటున్నారు. ఇదే తరహాలో మంచిర్యాల పోలీస్‌స్టేషన్ లో ఇప్పటి వరకు వందల వరకు ప్రయాణికులు ఫిర్యాదులు చేశారు. ప్రయాణికుల ఫిర్యాదులపై స్పందించిన అధికారులు దొంగలను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాని శాశ్వతంగా బస్టాండ్‌లో సిబ్బందిని నియమించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో మంచిర్యాల బస్టాండ్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ విభాగం ఉండేది క్రమేనా పోలీస్ సిబ్బంది తగ్గడంతో దాన్ని తొలగించారు. అధికారులు అప్పటి నుంచి బ్లూ కోర్టు సిబ్బందిదే బాధ్యత. వారు పలు రూట్‌లలో డ్యూటీలో ఉండడంతో బస్టాండ్ వైపు అంతగా దృష్టి సారించడం లేదు. గతంలో ఎక్కువ శాతం మొబైల్ ఫోన్‌లే దొంగతనం అయ్యేవి. అలవాటు పడ్డ దొంగలు ప్రయాణికుల నుంచి డబ్బులు, నగలు సైతం కొట్టేస్తున్నారని ఆర్టీసీ అధికారులు చెప్తున్నారు. మహిళ ప్రయాణికులు, కాలేజ్ అమ్మాయిలు ఎక్కువ శాతం బస్టాండ్ నుంచి రాక పోకలు కొనసాగిస్తారని వారి సౌకర్యార్థం మహిళా పోలీసులు ఉంటె బాగుంటుందని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు. గతంలో మంచిర్యాల బస్ డిపోలో పనిచేస్తున్న మహిళ కండక్టర్‌లు సైతం వేధింపులకు గురైన సందర్భాలు ఉన్నాయి.

దొంగతనాలతో ప్రయానికుల బెంబేలు

15 రోజుల క్రితం చెన్నూర్ నుండి మంచిర్యాలలో గల ఒక ఫంక్షన్ కు వస్తున్న మహిళ రూ.5 వేలు వెంట తెచ్చుకుంది. చెన్నూర్‌లో బస్ ఎక్కి మంచిర్యాలలో దిగింది. బస్టాండ్ నుంచి బయటకు వెళ్లే సమయంలో తన బ్యాగ్ చెక్ చేసుకోవడంతో అందులో ఉన్న డబ్బులు కనిపించలేదు. వెంటనే మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచరణ చేపట్టిన పోలీసులు దొంగను అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి సంఘటనే శనివారం సాయంత్రం మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట్ బస్ లో వెళ్ళడానికి మంచిర్యాల బస్టాండ్‌కు చేరుకున్న యువకుడి జేబులోచి పర్సు దొంగిలించే ప్రయత్నం చేయగా గమనించిన ప్రయాణికుడు అప్రమత్తమై అతన్ని పట్టుకున్నాడు. ప్రయాణికుడి నుంచి తప్పించుకొని పారి పోయే క్రమంలో అతన్ని చుసిన మరో వ్యక్తి వేరే పాయింట్ నుంచి పారి పోయాడు.



భద్రత పెంచుతాం

బన్సీలాల్, పట్టణ సీఐ మంచిర్యాల



సిబ్బంది కొరత తో రెగ్యులర్‌గా సిబ్బందిని ఇవ్వలేక పోతున్నాము. బ్లూ కోర్టు సిబ్బందినే బస్టాండ్‌లో తనిఖీలు చేసే విధంగా ఏర్పాట్లు చేశాం. బస్టాండ్‌లలో జరిగిన దొంగతనాలపై ఇప్పటికి చాలా వరకు ఫిర్యాదులు అందాయి. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు రెగ్యులర్ సిబ్బంది, అవుట్ పోస్ట్ లాంటివి ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తాం.

బెల్లంపల్లి ఎంఈఓను సస్పెండ్ చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

బెల్లంపల్లి ఎంఈఓను తక్షణమే సస్పెండ్ చేయాలని జాతీయ బీసీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ఏఓ రాజేశ్వర్‌కు ఆ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సల్మాన్ పాషా మాట్లాడుతూ బెల్లంపెల్లి మండలంలో, పట్టణంలో ఎలాంటి విద్యాశాఖ అనుమతులు లేకుండానే ప్రయివేటు కార్పొరేటు పాఠశాలలు ఏర్పాటు అవుతున్న మండల విద్యాశాఖ అధికారి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బెల్లంపల్లి పట్టణంలో నూతనంగా అబ్యాస పాఠశాలను విద్యాశాఖ నుంచి గాని, ఇతర శాఖల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఏర్పాటు చేస్తున్నారని ఇటీవల డీఈఓకు ఫిర్యాదు చేయగా డీఈఓ వెంటనే సంబంధిత మండల విద్యాశాఖ అధికారికి ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేసి అనుమతి లేని పాఠశాలలను మూసివేయాలని తెలిపిన ఎంఈఓ నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సదరు ప్రయివేటు పాఠశాలలతో లాలూచీ పడి ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్షంగా వ్యవహరిస్తున్న బెల్లంపల్లి ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే అబ్యాస పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకొని సీజ్ చేసి అనుమతులు ఇవ్వద్దని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అఖిల్, రియాజ్, సతీష్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రానికి పరికరాలు అందజేత



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని రెబ్బనపల్లి గ్రామంలో గల ఆరోగ్య ఉప కేంద్రానికి రూ.4 లక్షల విలువ చేసే ఆరోగ్య పరికరాలను వాషింగ్టన్ తెలుగు అసోసియేషన్, మిహోవా ఫౌండేషన్, గివ్ ద నీడ్, హోప్స్ అండ్ స్మైల్ స్వచ్ఛంద సంస్థల ద్వారా వాటిని సోమవారం స్థానిక మాజీ సర్పంచ్ కందుల అశోక్, నవ జ్యోతి యూత్ అసోసియేషన్ సభ్యులు ఆసుపత్రి సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి సతీష్ మాట్లాడుతూ ఆస్పత్రికి అవసరమైన ఈసీజీ పరికరం, ఆక్సిజన్ పరికరం, వంటి విలువ చేసే పరికరాలను దాతలు ఆస్పత్రికి అందించడం చాలా అభినందనీయమని గ్రామస్తులకు ఇది ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మరి కొంతమంది దాతలు ముందుకు వచ్చి తమ ఊరిలో ఉన్న ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం స్థానిక నాయకులు కందుల అశోక్ యూత్ సభ్యులు మాట్లాడారు. తమ గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ఎప్పుడు రుణపడి ఉంటామని గతంలో కూడా పాఠశాల భవనానికి దాతలు ఎంతగానో సహాయం అందించాలని గుర్తు చేశారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బండ ప్రసాద్, ఎంబడి సురేందర్, చుంచు మల్లేష్, బండ రాకేష్, నవజ్యోతి యూత్ అసోసియేషన్ సభ్యులు రాజేంద్రప్రసాద్, హెల్త్ సిబ్బంది ఉన్నారు.

ఐఎన్టీయూసీ రీజనల్ ఇన్‌చార్జికి సన్మానం



నవతెలంగాణ-మందమర్రి

ఐఎన్టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమయ్య బెల్లంపల్లి రీజనల్ ఇంచార్జిగా నియమితులైన సందర్భంగా సోమవారం పార్టీ నాయకులు, యూనియన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి డివిజన్ వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లూరి లక్ష్మణ్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెటి నరేందర్, దొరిశెట్టి చంద్రశేఖర్, వై సత్యనారాయణ, కారుకురి తిరుపతి, ఏడుకోలా పవన్ కుమార్, బుస రాజేష్, హనుమాండ్ల రాజేంద్రప్రసాద్, సది, శ్రావణ్, నక్క బాబు పాల్గొన్నారు.

రమాబాయి ఆశయ సాధనకు కృషి



నవతెలంగాణ-లక్సెట్టిపేట

అంబేద్కర్ సతీమణి రమాబాయి ఆశయాలు సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఇటిక్యాల స్టేజీ వద్ద పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మాత రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తన బిడ్డలను దేశం కోసం త్యాగం చేసిన మహా త్యాగశీలి అని అన్నారు. దేశంలో ఉన్న బిడ్డలను తన బిడ్డల్లో చూసుకున్నారని, దానివల్లనే నేడు దేశ ప్రజలందరికి రాజ్యాంగం ద్వారానే అందరికి హక్కులు సమాకురాయన్నారు. అనంతరం అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో మండల కమిటీ ఆధ్వర్యంలో ఆమెకు నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శనిగారపు లింగన్న, దమ్మ నారాయణ, మాలెం చిన్నన్న, చాతరాజు రాజన్న, తొగరు కాంతయ్య, అసాది పురుషోత్తం, దొంత నర్సయ్య, ముల్కల రాందాస్, బైరం లింగన్న, బైరం రవి, అల్లంపల్లి రమేష్, నంది తిరుపతి, గోల్కొండ సత్తయ్య, ఎనగందుల లక్ష్మణ్, చాతరాజు రాజేష్, లింగంపల్లి సుధాకర్, దుర్గాంజనేయులు పాల్గొన్నారు..

తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-మందమర్రి

తాగుడుకి బానిసై మూడవ జోన్‌కు చెందిన మేకల రవి(47) ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ మజీద్ ఖాన్ తెలిపారు. కూలి పని చేసుకునే రవి మద్యానికి బానిసై తాగడానికి డబ్బులు ఇవ్వాలంటూ తరచూ భార్యని వేధిస్తుండేవాడు. ఆదివారం రాత్రి మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్యతో గొడవ పడ్డాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో మద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతన్ని ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో రవి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మజీద్ ఖాన్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతుల గోస పట్టించుకోని అధికారలు

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-నస్పూర్

వరి ధాన్యం కొనుగోళ్ల రైతులు మోసపోతున్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి విమర్శించారు. సోమవారం సీపీఐ(ఎం) కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి, ఏఓకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వడ్ల కొనుగోలులో వ్యాపారులు, కొనుగోలు దారులు, రైస్ మిల్లర్లు, ట్రాన్స్ పోర్టు కుమ్మక్కై 40 కిలోల బస్తాకు తాలు, తేమ పేరుతో రెండు నుండి ఐదు కిలోలు కోత విదిస్తున్నారని, అంతేగాక లారీ మిల్లు వద్దకు వెళ్లిన తర్వాత అన్‌లోడ్ కావాలంటే కటింగ్ ఒప్పుకోవాలని బెదిరిస్తున్నారన్నారు. ఐకేపీ కేద్రంలో కొనుగోలు చేయకుండా పక్క గ్రామాల్లో తక్కువ రేటుకు కొనుగోలు చేసి ఐకేపీ కేంద్రంలో కొనుగోలు చేసినట్టుగా రాస్తున్నారని తెలిపారు. లారీలు రావడానికి రూ.3000 నుంచి రూ.5000 వరకు రైతుల వద్ద వసూలు చేస్తున్నారని, పంట పండించేటప్పుడు కన్నా అమ్ముకునేటప్పుడు అనేక రకాలుగా రైతులు దోపిడీకి గురవుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం కొనుగోలు సక్రమంగా లేకపోవడం వల్ల కొంతమంది రైతులు మధ్య దళారీ చేతుల్లో మోసపోతున్నారని, తక్కువ రేటు కూడా అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. సీపీఐ(ఎం) జిల్లా, గ్రామ నాయకులు గత వారం నుంచి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడడం జరిగిందన్నారు. రైతుల జీవితాలు గాలిలొ దీపం లాగా మారిపోయిందని, కష్టపటి పంట పండించిన రైతుకు నేడు మిగిలేది అప్పులు, వడ్డీలు అన్నట్లుగా ఉన్నదని అన్నారు. జిల్లాలో వడ్లు వచ్చి 20, 30 రోజులు గడుస్తున్న కొన్ని మండలాల్లో ఎక్కడి వడ్లు అక్కడనే ఉన్నాయని, వర్షం వస్తే రైతులు నిండమునిగిపోతారని వాపోయారు. కాంటా వేసిన బస్తాలు కూడ తరలించాలేని దుస్తితి ఉందని, రైతులు గోస పడుతుంటే జిల్లా అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. రైతును కాపాడుకోవాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని, స్వామినాథన్ సిఫార్సులు అమలుకు, ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకుంటే నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు బోడంకి చందు, దూలం శ్రీనివాస్, శాఖ కార్యదర్శిలు ఉమారాణి, సిడం సమ్మక్క, బొండ్ల సరిత, రైతులకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, అభినవ్, సత్యనారాయణ, సీపీఐ(ఎం) నాయకులు సిడం సమ్మక్క, కుమార్, మధు, యామిని, రమాదేవి, బూదక్క, కరింబీ, శంకరక్క, మడె తిరుపతి, కందుల రమేష్, సమ్మక్క పాల్గొన్నారు.

2వ విడత గొర్రెల యూనిట్ లబ్ధిదారులకు న్యాయం చేయాలి


● మంత్రి సీతక్కను కలిసిన సంఘాల నాయకులు



నవతెలంగాణ-జైపూర్

రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేయాల్సిన 2వ విడత గొర్రెల పంపిణీకి సబంధించిన లబ్ధిదారులకు ప్రభుత్వ పరంగా న్యాయం చేయాలని గొర్రెమేకల పెంపకం వృత్తిదార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ముఖ్య సలహదారు బేరి రాంచందర్ యాదవ్‌తో కలిసి సోమవారం మహత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2వ విడత గొర్రెల పంపిణీ కోసం లబ్ధిదారులు తమ వంతు వాట సొమ్మును బ్యాంకుల్లో డిపాజిట్ చేసి డీడీలు సంబంధిత శాఖ ద్వారా ప్రభుత్వానికి అందజేసినట్లు తెలిపారు. రెండు సంవత్సరాలు కావస్తున్నా గొర్రెల పంపిణీ కార్యక్రమం ముందుకు సాగకపోవడంతో లబ్ధిదారలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోందని వివరిస్తూ డీడీలు కట్టి గొర్రెల పంపిణీ కోసం ఎదురు చూస్తున్న లబ్దిదారులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క డీడీలు కట్టిన లబ్ధిదారులకు న్యాయం చేయడం కోసం తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలకు చెందిన గొర్రెమేకల పెంపకం వృత్తిదారుల సంఘం అధ్యక్షులతో కలిసి మంత్రి సీతక్కకు పుష్పగుచ్చం అందజేయడంతో పాటు శాలువాలతో సన్మానించారు. మంత్రి సీతక్కను కలిసిన వారిలో వనపర్తి జిల్లా అధ్యక్షుడు మధు యాదవ్, భూపాల్‌పల్లి జిల్లా అధ్యక్షుడు గజ్జి రమేష్ యాదవ్, మెడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల రాజు యాదవ్, మంచిర్యాల జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జీ కటవేణి మహేష్ యాదవ్, సాయన్న యాదవ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల కొనుగోళ్లపై అవగాహన



నవతెలంగాణ-లక్సెట్టిపేట

నకిలీ విత్తనాలు కనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ అధికారి సీహెచ్ ప్రభాకర్ రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని ఇటిక్యాల, గుళ్ళకోట, సూరారం, చందారం, వెంకట్రావుపేట గ్రామాల్లో రైతులు నకిలీ విత్తనాల విషయంలో తీసుకోలసిన జాగ్రతలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. లూజుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయకూడదని చెప్పారు. కొనుగోలు చేసిన దుకాణం నుంచి రశీదును తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. ఆ రశీదును పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రతగా భద్రపర్చాలని అన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్స్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తన పాకెట్ మీద తయారయిన తేది, కాలం ముగిసే తేది చూసుకోవాలని వివరించారు. గ్రామాలలో తక్కువ ధరకు, ఎక్కువ ధరకు అమ్మిన వారి వివరాలు మండల వ్యవసాయ అధికారికి తెలపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు గోవర్ధన్‌రెడ్డి, ప్రసన్న, ఇర్ఫాన యస్మీన్, శ్రీనివాస్, అనుష పాల్గొన్నారు.

దండేపల్లి : రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని నాగసముద్రం గ్రామంలో విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడిగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలు కొనవద్దని, కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా రశీదు పొందాలని, విత్తనాల ప్యాకెట్స్ బిల్లు రశీదులను పంట కాలము పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచాలని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధికృత డీలర్స్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సుమన్, రైతులు పాల్గొన్నారు.

తాండూర్ : రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని అధిక దిగుబడును పొందాలని మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి తెలిపారు. సోమవారం మండలంలోని కాజీపేట, చంద్రపెల్లి, పెగడపల్లి, రేపల్లెవాడ, అన్నారం గ్రామాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహచారు. అదేవిదంగా రేచీని, తాండూర్ క్లస్టర్ గ్రామాలలో ఏఈఓలు ధనలక్ష్మి, పుష్ప రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | మే 28, 2024 | www.navatelangana.com

నస్పూర్‌లో భారీ చోరీ

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్‌లోని న్యూనాగార్జున కాలనీలో సోమవారం భారీ దొంగతనం జరిగింది. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడి సత్తయ్య సింగరేణి ఉద్యోగి ఎస్ఆర్పీ1 గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రెండో బదిలీ విధులకు హాజరయ్యాడు. కుటుంబ సభ్యులు సాయంత్రం ఇంటి వెనకాల తలుపులు గడియ పెట్టారనుకొని ఇంటి ముందు తాళం వేసి వాకింగ్‌కు వెళ్లారని తెలిపారు. ఇంటికి వచ్చి చూసే సరికి బీరవ తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి బీరువాలో చూడగా బీరవాలోని 15 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.4.50 లక్షలు దొంగతనానికి గురైనట్లు తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించారు. స్థలం కొనుగులు నిమిత్తం భారీగా సొమ్మును ఇంట్లోనే ఉంచినట్టు భాధితుడు తెలిపారు. సంఘటన స్థలాన్ని మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ పరిశీలించారు. జాగిలం, వేలి ముద్ర నిపుణులతో దర్యాప్తు మొదలు పెట్టారు. తొందర్లోనే దొంగను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

మాజీ ప్రధాని నెహ్రూ సేవలు మరువలేనివి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారత మొట్టమొదటి ప్రధాన మంత్రిగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు మరువలేనివని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మాజీ ప్రధాని నెహ్రూ వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నాగరాజు, మావల మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సవీన్‌రెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణంలోని స్థానిక ఆర్కే-4 గడ్డలో నివాసం ఉండే గుజ్జ సుధాకర్ పక్షవాతం వచ్చి తీవ్ర అనారోగ్యంతో బాధపడున్నాడు. తమ కుల బాంధవుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పద్మశాలి సంఘం పెద్దలు సోమవారం ఆయన స్వగహానికి వెళ్లి పరామర్శించి, రూ.28626 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా మా కుల బాంధవులు అనారోగ్యంతో బాధపడుతున్న వారి సమాచారం తెలిపిన వెంటనే సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు ఎవరైనా దాతలు ఉంటే తమ సంఘానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ ఆడేపు తిరుపతి, ఉపాధ్యక్షుడు ఆడేపు కృష్ణ, కనుకుంట్ల సమ్మన్న, అక్కిపెల్లి సమ్మన్న, స్టీరింగ్ కమిటీ సభ్యుడు బొద్దున మల్లేష్, ఆడేపు లచ్చన్న, ఇప్పకాయల లింగయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొండ కుమార్, సంయుక్త కార్యదర్శి వేముల అశోక్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలంటే నిరంతర సాధన అవసరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడల్లో రాణించాలంటే నిరంతర సాధన ఎంతో అవసరమని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో నెల రోజులపాటు హైదరాబాద్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం ముగిసింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఇక్కడ నేర్చుకున్న క్రీడా నైపుణ్యాలకు మరింత పదును పెట్టేందుకు రోజూ మైదానంలో శ్రమించాలని సూచించారు. అనంతరం నెల రోజులపాటు శిక్షణ పొందిన విద్యార్థులకు క్రీడా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు అతవుల్లాఖాన్, రజీయుద్దీన్, విజయ్‌కుమార్, శిబిరం సహాయకులు గౌతం, జాకీర్ పాల్గొన్నారు.

వడదెబ్బతో రైతు మృతి

నవతెలంగాణ-దహెగాం

వడదెబ్బకు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని గిరవెల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నిట్టూరి ముత్తయ్య(61) ఉదయం గ్రామ సమీపంలోని పంట పొలం నుంచి వరిగడ్డిని తీసుకురావడానికి ఎడ్ల బండి తీసుకుని వెళ్లాడు. చాలా సేపటి వరకు రాకపోగా అనుమానంతో పొలం వద్దకు వెళ్ళి చూశారు. ఎండలో పడిపోయి ఉండదటన్ని కుటుంబ సభ్యులు గమనించారు. అక్కడి వెళ్లి పరీక్షించగా అప్పటికే మరణించాడని తెలిపారు.

ఘనంగా రమాబాయి వర్ధంతి

నవతెలంగాణ-వాంకిడి

రమాబాయి అంబేద్కర్ వర్థంతిని మండల కేంద్రంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి పంచశీల జెండాను ఎగరవేశారు. అనంతరం అంబేద్కర్‌కు తోడుగా అందించిన సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు సిద్ధార్థ, జయరాం, విజయ్, పాండు, విలాస్, రోషన్, సునీల్, మహిళా మండలి నాయకురాలు పాల్గొన్నారు.

పీవీటీజీ గురుకులంలో దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పీవీటీజీ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి 4 నుండి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీలతో పాటు మూడో తరగతిలో నూతన ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మూడో తరగతిలో 80, 4వ తరగతిలో 40, 5వ తరగతిలో 41, 9వ తరగతిలో ఏడు సీట్లు ఖాళీగా ఉన్నాయని, మొత్తంగా 168 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. పీవీటీజీ తెగలైన కొలాం, తోటి, మన్నె తెగకు చెందినవారు ఈనెల 31వ తేదీలోపు జిల్లా కేంద్రంలోని గురుకులంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఖరీఫ్ ప్రారంభానికి ముందే రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ : వ్యవసాయ సీజన్ ఖరీఫ్ ప్రారంభానికి ముందే రైతాంగ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల భవన్‌లో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అన్ని రకాల వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో రైతుల సమస్యల పరిష్కారంపై ప్రకటన చేశారని గుర్తు చేశారు. భూమాతగా ప్రకటించిన ధరణిలోని లోపాలను సరిచేయాలని అన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, భూసమస్యల లోపాలను సవరించి అందరికి పాస్‌పుస్తకాలు ఇవ్వాలని అన్నారు. సమగ్ర భూసర్వే నిర్వహించి, గ్రామ సభలు జరిపి లోపాలను సవరించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూరు తిరుపతి, రైతు సంఘం నాయకులు సుంచుల నారాయణ, జాదవ్ మోతిరాం, కిషన్ జాదవ్, పెద్ద గంగన్న పాల్గొన్నారు.

నేడు రైతు నేస్తం కార్యక్రమం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం ఉంటుందని ఏఈఓ కుంట మౌనిక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వివిధ రకాల వంగడాలు, వాటి దిగుబడి సామర్థ్యం గురించి అవగాహన కల్పించేందుకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మే 30 వరకే జొన్న కొనుగోళ్లు

నవతెలంగాణ-జైనథ్

మే30 వరకే జొన్న కొనుగోళ్లు చేపడుతున్నామని సీఈఓ గంగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కొన్ని రోజుల నుంచి మార్కెఫెడ్ ఆధ్వర్యంలో సహకార సంఘాల ద్వారా జొన్న కొనుగోళ్లను ప్రభుత్వం చేపట్టామని తెలిపారు. మండల రైతులు ప్రతి ఒక్కరూ తమ వద్ద ఉన్న జొన్న పంటను మే 30వ తేదీలోపు వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొని వచ్చి అమ్ముకోవాలని లేని పక్షంలో తర్వాత రోజు నుంచి కొనుగోలు చేయబడదని తెలియజేశారు.

కటౌట్లు అదిరే.. భూములు కొంటే బేజారే..!

నవతెలంగాణ-హాజీపూర్

- దొనబండ గ్రామంలో కాలువ భూములు కబ్జా
- అధికార పార్టీ నాయకుల అండతోనే అనే ప్రచారం
- ఆదివారం విందు, వినోదాలు



మండలంలోని దొనబండ గ్రామంలో పదుల సంఖ్యల ఎకరాల్లో వెంచర్లు ఏర్పాటు చేశారు. భారీ కటౌట్లు విపరీతమైన ప్రచారం చేస్తున్నారు. కానీ ఆ రెండు వెంచర్లు ప్రభుత్వ సాగు నీటి కాలువలను కబ్జా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాంటి భూమిని ఏజెంట్ల ద్వారా గజానికి రూ.10 నుంచి రూ.15 వేల వరకు అమ్ముతున్నట్లు సమాచారం. అసలు ఈ వెంచర్లకు అనుమతులు వున్నాయా లేవా అనేది అధికారుల నుంచి స్పష్టత కరువైంది. సంబధిత గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు తీసుకొని కొంత భూమిని జీపీ పేరు పై రిజిస్ట్రేషన్ చేసిన తరువాతే ప్లాట్లు అమ్మాల్సి ఉంటుంది కాని ఇప్పటి వరకు జీపీకి మాత్రం ఎలాంటి భూమి రిజిస్ట్రేషన్ చేయలేదని అధికారులు చెబుతున్నారు. వెంచర్ నిర్వాహకులు మాత్రం గ్రాండ్ ఓపెనింగ్స్ పేరుతో ఆఫర్ ధరలు ప్రకటిస్తూ సినీ యాక్టర్, సింగర్లతో మీటింగ్స్ ఏర్పాటు చేస్తున్నారు. అయిన కాని అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

పడతనపల్లి లిఫ్ట్ శిలాఫలకం తొలగింపు

అసెంబ్లీ ఎన్నికల ముందు హాజీపూర్ మండలానికి సాగు నీటి కోసం ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ పడతనపల్లి వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేస్తూ అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావు శంకుస్థాపన చేశారు. ఆ శిలాఫలకాన్ని నేల మట్టం చేసి, కెనాల్ రోడ్డును చదును చేసి వెంచర్‌కు అనుకూలంగా మార్చుకుని యథేచ్ఛగా ప్లాట్లు అమ్ముతున్నారు. దొనబండా అలంక్రిత వెంచర్ ఏర్పాట్లులో మండలానికి చెందిన ఓ చైర్మన్ అన్ని ఏర్పాట్లు చేసినట్లు విమర్శలు ఉన్నాయి. సదరు వెంచర్ యజమానులు పెద్దమొత్తంలో ఆ చైర్మన్‌కు ముట్టజెప్పినట్లు మండలంలో ప్రచారం జరుగుతోంది.





ధ్వంసం చేసిన శిలాఫలకం

జీపీకి ఎలాంటి భూమి రిజిస్ట్రేషన్ చేయలేదు

శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ, హాజీపూర్.

దొనబండలో ఏర్పాటు చేసిన వెంచర్ నిర్వాహకులు డీటీసీపీకి పోతున్నాము అని చెప్పారు. ఇప్పటివరకూ ఎలాంటి భూమి జీపీ పేరు పై రిజిస్ట్రేషన్ చేయలేదు. ఆదివారం పెద్దమొత్తంలో వెంచర్ నిర్వాహకులు కటౌట్లు పెట్టీ ప్రచారం చేశారనేది మా దృష్టికి వచ్చింది. సోమవారం సదరు వెంచర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తాను.

4న నిర్వహించే కౌంటింగ్‌కు భారీ బందోబస్తు

- ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



దేశంలో ఇప్పటి వరకు జరిగిన అరువిడతల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తోడ్పడిన అధికారులకు అభినందనలని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ అన్నారు. జూన్ 4న నిర్వహించే కౌంటింగ్ ఏర్పాట్లపై అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులు, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో న్యూఢిల్లీ నుండి భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఇతర సంయుక్త కమిషనర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశంలో ఇప్పటివరకు 6 విడతల ఎన్నికలు పూర్తయ్యాయని చివరి విడత ఎన్నికలు జూన్ 1న జరుగనున్నాయని చెప్పారు. పోలింగ్ పూర్తైన తరువాత కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలను తరలించి భద్రపరచడం జరిగిందన్నారు. జూన్ 4న నిర్వహించే కౌంటింగ్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫిరెన్స్ హాలులో జరిగిన వీడియో కాన్ఫిరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోగల సిర్పూరు, ఆసిఫాబాద్ నియోజక వర్గాల కౌంటింగ్ ఆదిలాబాద్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ హాలులో ఓట్లు లెక్కింపు కోసం టేబుళ్లు, పోస్టల్ బ్యాలట్ కౌంటింగ్‌కు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. రౌండ్ల వారీగా సమాచారాన్ని డిస్ ప్లే బోర్డుపై ప్రకటించడం జరుగుతుందని వివరించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు ఉంటుందని చెప్పారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్ లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపును పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-నిర్మల్

పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపు సందర్భంగా అధికారులకు, సిబ్బందికి నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపును పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నిర్మల్ జిల్లా ఓట్ల లెక్కింపును ఆదిలాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ అధికారులు జూన్ 4న ఉదయం 5.30 నిమిషాలకు ఓట్ల లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు జరుగుతున్నప్పుడు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, సమయానికి కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను ప్రారంభించాలని, అనంతరం ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కించాలని ఆదేశించారు. రౌండ్ల వారిగా లెక్కించిన ఓట్ల వివరాలను తెలిపేందుకు స్క్రీన్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే సంబంధిత ఏఆర్వోలకు సమాచారం అందించాలని, రౌండ్ల వారిగా లెక్కింపు పూర్తికాగానే సంబంధిత ఫారాలు అన్ని జాగ్రత్తగా నింపాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్‌లు సిబ్బందికి ఓట్ల లెక్కింపు సరళిని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో నిర్మల్, ఆదిలాబాద్ అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, శ్యామలా దేవి, నిర్మల్, బైంసా, ఉట్నూర్ ఆర్డీఓలు రత్న కళ్యాణి, కోమల్‌రెడ్డి, జీవాకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని టీజేఏసీ నాయకులు సామల వీరయ్య తల్లి భారత (70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం విషయం తెలుసుకున్న పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి పరామర్శించారు. మృతికిగల కారణాలను తెలుసుకొని ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వీరి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ రాజేశ్వర్, అడెల్లి ఆలయ మాజీ చైర్మెన్లు ఐటీ చందు, ఉట్ల రాజేశ్వర్ ఉన్నారు.

తాంసి : భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన తోనుపు నిఖిల్ గత రెండు రోజుల కింద మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చేతికి అందిన కొడుకు మృతి చెందడంతో తల్లీదండ్రులకు తీరని లోటని అన్నారు. కనిపెంచిన తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చిందని అన్నారు. ఇలా ఆవేశంలో ఆత్మహత్యలకు పూనుకోవడం మంచిది కాదని అన్నారు. ఎదైన సమస్య వస్తె కుటుంబ సభ్యులకు స్నేహతులకు చెప్పుకోవాలని, ఆత్మహత్యలకు పూనుకోవడం మంచిది కాదని అన్నారు. కుటుంబ సభ్యులు మనోధైర్యంగా ఉండాలని అన్నారు. అనంతరం అదే గ్రామంలో ఎమ్మెల్యే అభిమాని ఆఫ్రోజ్ బందువుల వాలీమా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లస్మన్న, నాయకులు గంగయ్య, మహేందర్, ఆఫ్రాజ్, శంకర్, తిరుమల్‌గౌడ్, ప్రీతమ్‌రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని వడగ్‌పూర్(కె) గ్రామంలో విత్తనాల కొనుగోలుపై సోమవారం ఏఈఓ బి.మహేష్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అనుమతి పొందిన విత్తన డీలర్ నుంచి మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లును పంట చేతికి వచ్చే వరకు తమ వద్దే ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సందే లక్ష్మణ్, రాజోలె రాజు, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ఎస్‌కేఈ డిగ్రీ కాలేజీలో 2006 బ్యాచ్ విద్యార్థులు పలువురు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు రామకృష్ణను కలిసి జ్ఞాపకాలను పంచుకున్నారు. విద్యార్థులు జాడి దీపక్, తౌటం కిరణ్, బండి పార్థు, జుమిడె రాజు, ప్రసాద్, స్వప్న, స్వాతి, వీణ, రజిత ఉన్నారు.

మహిళలకు రక్షణగా ఉంటాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలకు ఎల్లప్పుడూ రక్షణగా ఉంటామని షీటీం ఇన్‌చార్జి సునీత అన్నారు. జిల్లా కేంద్రంలోని చిర్రకుంట బస్టాండ్ వద్ద షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినులు, మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్ చేయాలని, లేదా షీ టీం ఆసిఫాబాద్ 8712670564కు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు శ్రీలత, స్వప్న పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కౌటాల

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, అప్రమత్తంగా ఉండాలని ఏఈఓ అంజన్న అన్నారు. సోమవారం మండలంలోని గుండాయిపేట్ గ్రామంలో రైతులకు పత్తి విత్తనాలపై అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలకు కచ్చితంగా బిల్ తీసుకోవాలన్నారు. బిల్లును పంట చేతికొచ్చే వరకు ఉంచుకోవాలని తెలిపారు. మొలక రాకున్నా, సరిగా కాపు లేకున్నా ఫిర్యాదు చేయవచ్చన్నారు. తీసుకున్న పాకెట్స్ మీద లేబుల్, లాట్ నెంబర్, బ్యాచ్ నెంబర్, డేట్ అఫ్ టెస్టింగ్, డేట్ అఫ్ ప్యాకింగ్, విత్తనాల రకం, కంపెనీ పేరు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. బిటి-3 గ్లైసిల్ విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో కొనరాదని పేర్కొన్నారు.

కౌంటింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఓట్ల లెక్కింపులో భాగంగా విధులు నిర్వహించే సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను పారదర్శంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలకు జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపుకు సరిపడ సిబ్బంది కేటాయింపు మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించి, ఎన్ఐసీ ర్యాండమైజేషన్ సాఫ్టవేర్ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. ఈనెల 28న జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో కేటాయించిన సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ మధుకర్, ఎన్ఐసీ ఇన్‌చార్జి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుందాం

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలు గొప్పవని వాటిని కాపాడుకుందామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని సాకెర గ్రామంలో 'భావె మహినా' సందర్భంగా సోయం పరివార్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పెర్సాపేన్‌లకు ఎమ్మెల్యే, ఎంపీ సోయం బాపురావుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.ఆదివాసీలు ప్రకృతిని దైవంగా భావించి ఎంతో నియమ నిష్టలతో పూజలు చేసి తమ సంస్కృతి సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను యావత్ ప్రపంచానికి చాటి చెప్పడం జరుగుతుందని పేర్కొన్నారు. నేటి యువత సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఆదివాసీపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సోయం బాపురావు, సోయం కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అమ్మఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయాలి

నవతెలంగాణ-నేరడిగొండ

అమ్మఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయాలని ఈఈ ఆర్ అండ్ బి నర్సయ్య, ఏఈ సంజయ్, ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు. సోమవారం మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని అన్నారు. నాసిరకం వాడద్దొన్నారు. పారిశుధ్య పనులు చేపట్టాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని అన్నారు. జూన్ 10లోపు అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ముగించాలని మళ్లీ ఎటువంటి సమస్యలు పాఠశాలలో ఉండకూడదని అన్నారు.

30 పీవీటీజీ విద్యార్థులకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆదిమ, గిరిజన, కొలాం, తోటి, కొలవార్ విద్యార్థిని, విద్యార్థులు 2022-23, 2023-24 విద్య సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీతో పాటు జెఈఈ, అడ్వాన్స్, ఎంసెట్, నీట్, సీఈసీ, హెచ్ఈసీ ఆర్ట్స్ వారికి ఎంఎ, లాసెట్ ప్రవేశం కోరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ గిరిజన సంక్షేమ ప్రతిభ కళాశాలలు హయత్ నగర్, హైదరాబాద్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 30న కేబి కాంప్లెక్స్‌లోని గురుకుల ఇంటర్ బాలికల కళాశాలలో తమ అన్ని సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డు, నాలుగు పాస్ ఫోటోలు తీసుకొని రావాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఇచ్చోడ

గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన విలేకరి సిద్దార్థ్ నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు తిరుమల్‌గౌడ్, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్ రెడ్డి ఉన్నారు.